




శివకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాద్రిలో భక్తుల సందడి

- ప్రత్యేక దర్శనం చేసుకున్న 3,400మంది భక్తులు
- శివాలయంలో నూతన కల్యాణ మండపం ప్రారంభం

భద్రాచలం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తుల సందడి నెల కొంది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ నలుమూలలనుంచి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. స్వామివారి మూలవరులకు ఆదివారం నిర్వహించిన ఆర్జిత అభిషేకంలో సుమారు 50 మంది, నిత్యకల్యాణంలో 80మంది భక్తులు పాల్గొన్నారు. 3,400 మంది భక్తులు భద్రాద్రి రామయ్యను ప్రత్యేక దర్శనం చేసుకున్నారు.

నూతన కల్యాణ మండపం ప్రారంభం

భద్రాచలం దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీఅన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వారి ఆలయంలో నూతన కల్యాణ మండపాన్ని ఆదివారం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రారంభించారు. భద్రాచలానికి చెందిన యాలం బాబ్జీ, సత్యకుమారి దంపతులు, యాలం అప్పారావు కుటుంబ సభ్యులు రూ.6లక్షలతో కల్యాణ మండపాన్ని నిర్మించారు. ప్రారంభ కార్యక్రమం అనంతరం శివకల్యాణం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను ఈవో ఎల్.రమాదేవి సమర్పించారు. ఇదిలా ఉండగా భద్రాచలానికి చెందిన కొంజర్ల సుబ్రమణ్యం, కృష్ణకుమారి దంపతులు భద్రాద్రి రామయ్యకు స్వర్ణహారాన్ని సమర్పించారు. 63 గ్రాములతో తయారు చేసిన ఈ హారం విలువ రూ.4లక్షలు ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ హారాన్ని దేవస్థానం పర్యవేక్షకులు కత్తి శ్రీనివాస్‌కు దాతలు కొంజర్ల సుబ్రమణ్యం-కృష్ణకుమారి దంపతులు అందజేశారు. హైదరాబాద్ వాస్తవ్యులు పొన్నూరు ఉమాసుకన్య స్వామివారికి వెండిమీద బంగారు పూత కలిగిన రెండు హారాలను అందించారు.



రామాలయంలో భక్తుల సందడి

జిల్లా ప్రజలకు ఆధునిక వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిని మెడికల్ కళాశాలకు అనుసంధానం చేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయనుకున్న జిల్లా ప్రజలకు నిరాశే మిగులుతోంది. గతంలో వైద్య విధాన పరిషత్ పరిధిలో ఉన్నప్పుడే యూరాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ సేవలు అందుబాటులో ఉండేవి. కానీ మెడికల్ కళాశాలకు అనుసంధానం చేసిన తర్వాత ఈ సేవలన్నీ మూలనపడ్డాయి. అంతేకాకుండా పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవటంతో ఆశించిన వైద్యం అందడం లేదు. అలాగే పలు రకాల ఆధునిక యంత్ర పరికరాలు ఏర్పాటు చేసినా అత్యవసరమైన ఎంఆర్ఐ యంత్రం అందుబాటులోకి తీసుకురావడాన్ని విస్మరించారు. అత్యవసరమైన ఈ పరికరాన్ని తీసుకొచ్చేందుకు ఏళ్ల తరబడి ఇదిగో అదిగో అంటున్నారే తప్ప కార్యరూపం మాత్రం దాల్చడం లేదు. దీంతో బాధితులను ఈ పరీక్షల కోసం ఇతర ప్రాంతాలకు, ప్రైవేటుకు రిఫర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



అందని ద్రాక్షగా ఆధునిక వైద్యం

- ఖమ్మం పెద్దాసుపత్రిలో అందుబాటులో లేని ఎంఆర్ఐ యంత్రం
- అత్యవసర వేళల్లో బాధితులకు అందని మెరుగైన వైద్యం
- ప్రైవేటుకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్న పేదలు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా ఎంఆర్ఐ సౌకర్యం లేకపోవటంతో అత్యవసర చికిత్సకు వచ్చే బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు. ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి నిత్యం కనీసం 20వరకు రోడ్డు ప్రమాద క్షతగాత్రులు వస్తుంటారు. వీరికి అవసరమైన సీటీ స్కానింగ్ అందుబాటులో ఉన్నా రేడియాలజిస్టులు లేక ఆపసోపాలు పడుతోంది. అయితే తలకు తీవ్రగాయాలైన క్షతగాత్రులను పరీక్షించేందుకు ఎంఆర్ఐ అవసరం ఉంటుంది. ఈ సౌకర్యం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో ఇదివరకు మాదిరిగానే హైదరాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు రిఫర్ చేయాల్సి వస్తోంది. ఇటీవల సత్తుపల్లి పట్టణానికి చెందిన ఒక బాధితుడికి మెదడులో లోపం ఏర్పడి అచేతనావస్థకు చేరుకున్నారు. వెంటనే ఎక్స్‌రే తీయించారు. అందులో స్పష్టత లేకపోవటంతో సీటీ స్కాన్ చేశారు. ఇందులోనూ సమస్య అస్పష్టంగా కనిపించటంతో ఎంఆర్ఐ విధిగా చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే జిల్లా ఆస్పత్రిలో ఆ సౌకర్యం అందుబాటులో లేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. ఏన్కూరు మండలానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి చెవులు, ముక్కు నుంచి రక్తస్రావం అయ్యింది. ఆ వ్యక్తిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా పరిస్థితి విషమించిందని తేల్చిచెప్పడంతో హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ ఎంఆర్ఐ తీసి మెదడులో రక్తం గడ్డకట్టిందని, ఇక్కడికి రావడంలో తీవ్ర జాప్యం జరిగిందని చెప్పారు. దీంతో ఆపరేషన్ చేయకముందే ఆ వ్యక్తి మృతి



చెందాడు. కొన్ని సందర్భాల్లో బాధితులకు 24గంటల పాటు నిపుణుల పర్యవేక్షణ అవసరం అవుతుంది. కానీ వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో షరా మామూలుగా వారిని ఇతర ప్రాంతాలకు పంపాల్సి వస్తోంది. ప్రమాదాల బారిన పడ్డవారు, మెదడుకు సంబంధించిన ఇబ్బందులు ఉన్న బాధితులకు స్పష్టమైన వైద్యం అందాలంటే ఎంఆర్ఐ చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లా ఆస్పత్రిలో ఆ యంత్రం అందుబాటులో లేదు. దీంతో బాధితులు ఈ పరీక్ష కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అంతే కాదు ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబీకులు ఒక్కోసారి ప్రాణాలనే కోల్పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, జిల్లాకు చెందిన మంత్రులు దీనిపై దృష్టి సారించి ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి ఎంఆర్ఐ సౌకర్యాన్ని తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం



డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

జిల్లా ఆసుపత్రిలో ఎంఆర్ఐ లేకపోవటం ఇబ్బందిగానే ఉంది. ఈ యంత్రం కోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పంపించాలని కోరడంతో నివేదికలను పంపించాం. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. నిత్యం సీటీ స్కానింగ్‌లు 40 నుంచి 50 వరకు తీస్తున్నాం. ఎంఆర్ఐ కూడా ఉంటే అత్యవసర రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. త్వరలో ప్రభుత్వం దీన్ని మంజూరు చేస్తుందని భావిస్తున్నాం.

ఓవరాల్ చాంపియన్‌గా కరీంనగర్

- జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక
- ముగిసిన అండర్-14 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

7

వైజ్ఞానిక ప్రదర్శనకు వేళాయే..

- అన్నపురెడ్డిపల్లిలో నేటినుంచి భద్రాద్రి జిల్లా సైన్స్ ఫెయిర్




మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం సీపీ సునీల్‌దత్

అప్పులు తీర్చేందుకు తుపాకులు పట్టారు

- ఖమ్మంలో ఇద్దరు వ్యక్తుల అరెస్ట్.. మూడు పిస్టల్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఖమ్మం సీపీ సునీల్‌దత్

ఖమ్మం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి అప్పుల పాలైన ఇద్దరు వ్యక్తులు వాటిని తీర్చేందుకు నక్సలైట్ల పేరుతో తుపాకులు చూపించి వ్యాపారులను బెదిరించి డబ్బులు వసూలు చేసేందుకు యత్నించగా ఖమ్మం పోలీసులు అరెస్టు చేశారు. దానికి సంబంధించిన వివరాలను ఆదివారం ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల ఖమ్మం సీపీ సునీల్‌దత్ వెల్లడించారు. ఖమ్మం నగరానికి చెందిన మెకానిక్ మహ్మద్ అఫ్సర్, ఖమ్మం ఖానాపురంలో నివాసం ఉంటున్న బయ్యారం మండలం కొత్తపేట గ్రామానికి చెందిన గుండమల్ల వెంకటేశ్వర్లు కలిసి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసి నష్టపోయి అప్పులపాలయ్యారు. వాటిని ఎలాగైనా తీర్చాలని నిర్ణయించుకుని తుపాకులు కొనుగోలు చేశారు. గతంలో నక్సలైట్ల పేరుతో తుపాకులు చూపించి వ్యాపారస్తుల నుంచి డబ్బులు వసూలు చేసిన అనుభవంతో సుమారు 11నెలల క్రితం ఎండీ రియాజ్ అనే వ్యక్తిని సంప్రదించారు. ముగ్గురు కలిసి తుపాకులు కొనుగోలు చేసేందుకు బీహార్‌కు వెళ్లగా.. ఆ సమయంలో వారికి తుపాకులు దొరక్కపోవడంతో వెనక్కి తిరిగొచ్చారు. ఆ తర్వాత మళ్లీ రియాజ్‌ను బీహార్ పంపి పిస్టళ్లు తెప్పించారు. అనంతరం పథకం ప్రకారం ఆదివారం ముదిగొండ ప్రాంతంలో గ్రానైట్ వ్యాపారస్థుల దగ్గరకు వెళ్లి నక్సలైట్ల పేరుతో బెదిరించి డబ్బులు వసూలు చేసేందుకు అఫ్సర్, వెంకటేశ్వర్లు బయలుదేరి వెళుతూ వాహనాలు తనిఖీ చేస్తున్న త్రీటౌన్ పోలీసులకు చిక్కారు. వారి నుంచి మూడు పిస్టళ్లు, నాలుగు మాగజైన్లు, 17బుల్లెట్లను, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా ఆ ఇద్దరిపై గతంలో గార్ల, మరిపెడ, మహబూబాబాద్ టౌన్‌లలో ఆర్మ్ యాక్ట్, దోపిడీ కేసులు నమోదైనట్లు సీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం ఏసీపీ రమణమూర్తిని, సీఐ డి.రమేష్, ఎస్ఐ కోటా నాగేశ్వరరావులను ఆయన అభినందించారు.



‘పులిగుండాల’కు పర్యాటక శోభ

- అటవీ అందాలు ఆస్వాదించాల్సిందే
- రాష్ట్ర బడ్జెట్లో ఎకోటూరిజంలో ఎంపిక
- నిధుల కేటాయింపు

6

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు

- ఖమ్మం జిల్లాలో 87, భద్రాద్రి జిల్లాలో 39 కేంద్రాల్లో పరీక్షలు
- నిమిషం నిబంధనతో పరీక్ష కోల్పోయిన పలువురు అభ్యర్థులు

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, రెండో విడతలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయత్రం 5.30గంటల వరకు రెండు సెషన్లలోనూ పరీక్షలు నిర్వహించారు. అధికారులు తీసుకున్న ముందస్తు చర్యలతో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఖమ్మం జిల్లాలో మొత్తం 27,984 మంది అభ్యర్థుల కోసం 87 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాత కలెక్టరేట్‌లో స్ట్రాంగ్ రూంలో ఉంచిన ప్రశ్నాపత్రాలను ప్రత్యేక బస్సుల ద్వారా రూట్ ఆఫీసర్లు ఉదయం 8 గంటలకే బందోబస్తుతో కేంద్రాలకు తీసుకొచ్చారు. నిబంధనల ప్రకారం ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదన్న నిబంధనను కచ్చితంగా పాటించారు. కేంద్రాలముందు పోలీసులు పరీక్ష సూపరింటెండెంట్లు కచ్చితంగా 9.30గంటలకు గేట్లను మూసేశారు. ఖమ్మంలోని ఎస్సార్‌బీజీఎన్నార్, పీజీ డిగ్రీ కళాశాల, నయాబజార్ కళాశాల కేంద్రాల్లో పలువురు అభ్యర్థులు 9.33 నిమిషాలకు వచ్చినా లోనికి అనుమతించలేదని వాపోయారు. ఎస్సార్‌బీజీఎన్నార్ కళాశాల కేంద్రానికి ముగ్గురు అభ్యర్థులు, పీజీ కళాశాలకు ముగ్గురు అభ్యర్థులు మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. లోనికి అనుమతించాలంటూ పోలీసులను, సూపరింటెండెంట్లను బ్రతిమలాడుకున్నారు. ఏడాదిగా ఈ పరీక్ష కోసం సిద్ధం అయ్యామని అధికారులను వేడుకున్నా.. వారు లోనికి అనుమతించకపోవడంతో నిరాశగా వెనుదిరిగారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెంలో మొత్తం 39 సెంటర్లలో గ్రూప్-3 మొదటి రోజు పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మొత్తం 13,478 మంది అభ్యర్థులకుగాను తొలిరోజు పరీక్షలకు 7,212 మంది హాజరుకాగా 6,266 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక్క నిమిషం నిబంధనతో పలువురు అభ్యర్థులు పరీక్ష రాయలేకపోయారు. రుద్రంపూర్ సెయింట్ జోసెఫ్ పాఠశాల పరీక్ష సరళిని పరిశీలించిన ఎస్పీ రోహిత్‌రాజ్ విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.



కొత్తగూడెం ఉమెన్స్ కాలేజీలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



ఖమ్మంలో అభ్యర్థులను తనిఖీ చేసి లోనికి పంపిస్తున్న దృశ్యం



ఖమ్మంలో పరుగెత్తుకుంటూ పరీక్షా కేంద్రానికి..

మెడికోకు ‘గుండు’ ఘటనపై కేసు నమోదు

విచారణకు ఆదేశించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ఖమ్మం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెడికోకు గుండు గీయించిన ఘటనపై ఆదివారం కేసు నమోదైంది. ఖమ్మం మెడికల్ కళాశాల మొదటి సంవత్సర విద్యార్థికి అసిస్టెంట్ ప్రొఫెసర్ గుండుగీయించిన సంఘటన వెలుగులోకి రాగా.. దానిపై విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఖమ్మం సీపీ సునీల్‌దత్ తెలిపారు. కాగా ర్యాగింగ్‌కు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సమాచారం. సంఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ విద్యార్థికి గుండు కొట్టించిన విషయంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాగింగ్ ప్రభావం విద్యార్థుల భవిష్యత్తుపై పడకుండా చూడాలని ఉన్నతాధికారులకు సూచించారు. ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, అన్ని కాలేజీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ఘటనపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మెడికల్ కళాశాల బాలుర వసతిగృహం ముందు ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి తుండుం ప్రవీణ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దోజు శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.



ఖమ్మం మెడికల్ కళాశాలలో విచారణ నిర్వహించి వెళ్తున్న ఏసీపీ రమణమూర్తి

బీసీ రిజర్వేషన్లపై నెలలో నివేదిక

- రిజర్వేషన్ అమలుపై సంఘాల నుంచి అభిప్రాయ సేకరణ
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకే బీసీ కమిషన్
- తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేషన్ కమిటీ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు

6



మాట్లాడుతున్న బూసాని వెంకటేశ్వరరావు

ప్రకృతి అందాలు


రెండు గుట్టల మధ్య పులిగుండాల ప్రాజెక్టు

'పులిగుండాల'కు పర్యాటక శోభ

- అటవీ అందాలు ఆస్వాదించాల్సిందే
- రాష్ట్ర బడ్జెట్లో ఎకోటూరిజంలో ఎంపిక
- నిధుల కేటాయింపు
- నెరవేరనున్న దశాబ్దాల కల

పెనుబల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలంలో అటవీ ప్రాంతంలో ఉన్న పులిగుండాల ప్రాజెక్టు పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోనుంది. దీని కోసం ఎకో టూరిజం నుంచి నిధులు మంజూరైనట్టు అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు. ఎకోటూరిజంలో రాష్ట్రవ్యాప్తంగా 12 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వాటిలో ఉమ్మడి ఖమ్మంజిల్లా నుంచి కనకగిరి కొండలు, కిన్నెరసాని ప్రాజెక్టును ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అటవీ అభివృద్ధి కార్పొరేషన్ నుంచి నిధులు మంజూరు చేసి పులిగుండాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా పులిగుండాల ప్రాజెక్టు నుంచి పులిగుండాలకు సుమారు రెండు కిలోమీటర్లు రోప్‌వే నిర్మాణాన్ని, పులిగుండాల నుంచి పల్లెలబాయి గుట్టు (జెండాలపాడు)వరకు సఫారీ స్వారీని పెట్టి ఇందుకోసం ఇప్పటికే ముంబై నుంచి ఆర్కిటెక్ అధికారులు ఈ ప్రాంతానికి వచ్చి సర్వే నిర్వహించినట్లు అటవీశాఖ అధికారులు కూడా ధ్రువీకరిస్తున్నారు.



పులిగుండాల ప్రాజెక్టు నిర్మాణం...

పెనుబల్లి మండల కేంద్రానికి 15కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో గుట్టల మధ్య 1990లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నెదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా జలగం ప్రసాదరావు ఉన్న సమయంలో రెండు గుట్టల మధ్య ప్రాజెక్టును ఏర్పాటుచేసి పెనుబల్లి, కల్లూరు మండలాలకు చెందిన సుమారు 700 ఎకరాలకు సాగు నీరందిం చేందుకు 51ఎకరాల విస్తీర్ణంలో పులిగుండాల ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టు నీటి ద్వారా వేసవికాలంలో అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల దాహార్తిని కూడా తీరుస్తుంది.

సండే సందడి...

ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, ఏన్కూరు మండలాల మధ్య 52వేల ఎకరాల్లో కనకగిరి కొండలు వ్యాపించి ఉన్నాయి. ఈ కొండల్లో చిరుతపులులు, ఎలుగుబంట్లు, జింకలు, పందులు, దున్నలు తదితర వన్యప్రాణులకు నిలయంగా ఉంది. ఈ అటవీ ప్రాంతంలో ఉన్న పులిగుండాల ప్రాజెక్టుకు ఏడాది పొడవునా ప్రాజెక్టును సందర్శించేందుకు అనేక ప్రాంతాల నుంచి ఈ ప్రాజెక్టు సందర్శకులతో ప్రతి ఆదివారం కళకళలాడుతుంది.

అటవీ ప్రాంతంలోని శివాలయానికి భక్తుల రాక...

ప్రాజెక్టు వద్ద పురాతన శివాలయం కూడా ఉంది. ప్రతి ఏడాది మహాశివరాత్రి సందర్భంగా ప్రాజెక్టు వద్ద జాతరను నిర్వహిస్తున్నారు. ఈ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా ఏర్పాటుచేయాలని దశాబ్దాల కాలంగా ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు. ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పులిగుండాల ప్రాజెక్టుపై ప్రజాప్రతినిధులు దృష్టిసారించడంతో కనకగిరి గుట్టల్లో ఉన్న ఈ ప్రాజెక్టుకు మహర్దశ పట్టనుంది. పులిగుండాల ప్రాజెక్టుకు సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వేసవిలో మాత్రమే సందర్శకులతో కళకళలాడుతుంది. ఎకోటూరిజం ద్వారా ప్రాజెక్టు వద్ద జంతు ప్రదర్శనశాల, పార్కు, టాయ్‌లెట్లు బోటు షికార్ చేసేందుకు కూడా అవకాశముంది. ఎకోటూరిజంలో నిధులు మంజూరు చేయడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది.

ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటుతాం

రామ్‌సింగ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, కల్లూరు



అటవీ కార్పొరేషన్ నుంచి ఎకోటూరిజం ద్వారా పులిగుండాలతోపాటు కనకగిరి కొండలను అభివృద్ధి చేయనుంది. అందులో భాగంగా తమ శాఖ ద్వారా పులిగుండాల ప్రాజెక్టు వద్ద వాహనాల పార్కింగ్, బుకింగ్ కౌంటర్ ఏర్పాటుతోపాటు ఇప్పటికే ఖాళీ ప్రదేశంలో మొక్కలను నాటాలని నిర్ణయించాం.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

బోనకల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం నిరంతర పోరాటాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కుటుంబ సమగ్ర సర్వే పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమం గందరగోళంగా మారిందన్నారు. ప్రజా పాలనను గాలికొదిలి ప్రభుత్వం మాయ మాటలతో గారడి చేస్తుందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి ఆచరణలో విస్మరించిందన్నారు.


మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ప్రాజెక్టుల విషయంలో ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, జిల్లా, మండల నాయకులు చింతల చెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, జొన్నలగడ్డ సునిత, తుళ్లూరి రమేష్, కందికొండ శ్రీనివాసరావు, దొప్ప కొరివి, తెల్లాకుల శ్రీనివాసరావు, గుగులోతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కల్లాల్లో ధాన్యాన్ని వెంటనే కొనాలి

బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి

పెనుబల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలో లక్షలాది ఎకరాల్లో పండించిన వరిపంటకు ప్రభుత్వం నిర్ణయించిన తేమశాతం 17ఉన్నా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా కొర్రీలు పెడుతున్నారని బీజేపీ పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేయకుండా 15రోజులుగా రైతులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. రూ.500బోనస్ కూడా అక్కర్లేదు ధాన్యం కొనుగోలు చేయండి అన్నా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. జిల్లా అధికారులు స్పందించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. ఆ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొర్రా నర్సింహారావు, జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్‌రావు, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి రాము పాల్గొన్నారు.




వర్చువల్ మీట్‌లో తాతోలు దుర్గాచారి

అంతర్జాతీయ వర్చువల్ బుక్ ఫెయిర్‌లో స్థానం

భద్రాద్రి కవికి దక్కిన అరుదైన అవకాశం

భద్రాచలం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వర్చువల్ బుక్ ఫెయిర్ 2024ను పెరూ దేశంలోని అంతర్జాతీయ సాహిత్య వేదిక నిర్వహించగా అందులో పాల్గొనే అరుదైన అవకాశం భద్రాచలానికి చెందిన కవి, ఆర్టీసీ కంట్రోలర్ తాతోలు దుర్గాచారికి దక్కింది. వర్చువల్ బుక్ ఫెయిర్ సంస్థ అధినేత సీజార్, భారతదేశ సాంస్కృతిక రాయబారి, ప్రముఖ కవయిత్రి ప్రభావతి జోశ్యుల ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కవి తాతోలు దుర్గాచారి 'రేకు విచ్చిన మొగ్గ, తాతోలు హైకోలు, తీరం చేరని కెరటాలు' తదితర సంకలనాలను తాను రచించి ప్రచురించగా వాటి గురించి వివరించారు. ఇదే సమయంలో దేశ ఔన్నత్యాన్ని చాటేలా కవిత్వాన్ని వినిపించి గానంను ఆలపించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వర్చువల్ బుక్ ఫెయిర్‌లో తమ ఆర్టీసీ ఉద్యోగికి దక్కడం పట్ల ఆర్టీసీ డీఎం తిరుపతి, సిబ్బంది అభినందించారు.

'స్ఫూర్తి' పురస్కారం అందుకొన్న మౌలాలి

కల్లూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి) మండలంలోని పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎండీ మౌలాలి హైదరాబాద్‌లో స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ వారు ఆయనకు ఈ పురస్కారం అందించారు. సమాజంలోని పేదలందరికీ ఉన్నతమైన విద్య అందించటంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు సాంఘిక దురాచారాలను, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తూ ప్రతి సంవత్సరం వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రేరణ, ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నవంబరు 17న అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శాతవాహన యూనివర్శిటీ కరీంనగర్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమేష్‌కుమార్, శారద ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పట్నం కమల మనోహర్, నైపుణ్యాల అభివృద్ధి సీఈవో డాక్టర్ మునీష్‌జిందాల్ నుంచి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పేరువంచ పాఠశాలనుంచి పురస్కారం అందుకున్న మౌలాలికి పీఆర్టీయూ జిల్లా, మండల నాయకులు శ్రీనివాసరావు, శ్రీను, పఠాన్ రహీమ్ రమేష్, చాందుసాహెబ్ అభినందనలు తెలిపారు.



పురస్కారం అందుకుంటున్న ఎండీ మౌలాలి

పత్తి రైతులకు కూలీల కొరత

- అన్ని చోట్లా ఒకేసారి పక్వానికొచ్చిన పంట
- స్థానికంగా లభించని కూలీలు
- ఇతర ప్రాంతాలకు రైతుల పరుగులు
- జిల్లాలో జోరుగా పత్తి తీసే పనులు

జూలూరుపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి ఎన్నో వ్యయప్రయసాల కోర్చి సాగుచేసిన పంటను తీసుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కూలీల కొరతతో పంట సేకరణ కోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. స్థానికంగా కూలీలు దొరక్కపోవడంతో రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి తీసుకురావాల్సి వస్తోంది. ముఖ్యంగా భద్రాద్రి జిల్లాలోని జూలూరుపాడు మండలంలో ఈ ఏడాది సుమారు 20వేల ఎకరాల్లో రైతులు పత్తి సాగును చేపట్టారు. నెల క్రితం పత్తి ఏరే పనులు ప్రారంభమయ్యాయి. కానీ కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో కొంతమంది రైతులు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు వెళ్లి కూలీలను తీసుకు వచ్చారు. కాగా పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, కొణిజర్ల, కొత్తగూడెం, పాల్వంచ, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాలకు చెందిన వందల సంఖ్యలోని కూలీలను మరికొందరు రైతులు తరలిస్తున్నారు.

కూలీలకు పెరిగిన డిమాండ్

మిర్చి తోటల్లో కలుపు, పత్తి తీత పనులు ఒకేసారి రావడంతో కూలీలకు గిరాకీ పెరిగింది. ఇప్పటికే చేలల్లో పత్తి నేలరాలిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతూ కూలీలను బతిమిలాడి పనులు చేయించుకుంటున్నారు. కూలీలకు డిమాండ్ పెరగడంతో వారు కూలి రేట్లను కూడా పెంచారు. గత ఏడాది కేజీ పత్తి తీస్తే రూ.10లు చెల్లించగా ఈ ఏడాది రూ.15నుంచి రూ.18లతో పాటు రవాణా చార్జీలను కూడా ఇస్తున్నారు. తొలివిడత పత్తితీతల సమయంలోనే పరిస్థితి ఇలా ఉంటే రెండో విడత పత్తితీత పనులపై రైతుల్లో అప్పుడే ఆందోళన మొదలైంది. ప్రతి ఏటా చివరి దశలో కూలీల కొరత ఉండేది. కాగా ఈ ఏడాది ప్రారంభంలోనే కూలీల కొరతను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో రెండో విడత పత్తితీత పనులకు అసలు కూలీలు దొరుకుతారా లేదా అన్న ఆందోళన నెలకొంది.


పత్తితీత పనులకు వచ్చిన మహారాష్ట్ర కూలీలు

మహారాష్ట్ర నుంచి కూలీలు..

బాణోత్ రవి, రైతు అన్నారపాడు



పత్తితీతల పనులకు స్థానికంగా కూలీలు దొరకటం లేదు. చేతికొచ్చిన పంట నేలరాలి పోతుండటంతో మహరాష్ట్ర వెళ్లి కూలీలను తీసుకువచ్చా. పెట్టుబడి పెరిగిపోయింది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రెండో విడత పత్తి సేకరణకు కూలీలు దొరుకుతారో లేదోనని ఆందోళనగా ఉంది.


తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సమాఖ్య సభ్యురాలు


రికార్డుల్లో కొనుగోలు వివరాలు నమోదు చేస్తున్న సభ్యులు

ధాన్యం కొనుగోళ్లలో అగ్రగామి

- జిల్లాలోనే ప్రథమ స్థానంలో పుల్లయ్య బంజరు మల్లిక గ్రామ సమాఖ్య
- సగటున రోజుకు 2 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు
- 14 సంవత్సరాలుగా కేంద్రాన్ని నడుపుతున్న గ్రూపు సభ్యులు
- రైతులకు సేవల్లో ఆదర్శంగా నిలిచిన మహిళలు

కల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు. దర అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆ క్రమంలోనే ఐకేపీ, డీఆర్డీఏ ఆధ్వర్యంలో కూడా మహిళా గ్రూపుల తరుపున కూడా ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలోనే ఐకేపీ, డీఆర్డీఏల ఆధ్వర్యంలో ఈ ఏడాది 139 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వానకాలం దిగుబడి అయిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు కల్లూరు మండలంలోని పుల్లయ్యబంజర (శివాలయం ప్రాంగణంలో) ఇటీవల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

రోజు రెండు వేల బస్తాలు..

ఈ కేంద్రంలో ఐకేపీ నుంచి మల్లిక గ్రామ సమాఖ్య రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయటంలో జిల్లా స్థాయిలోనే అగ్రగామిగా నిలిచింది. ప్రతీ రోజు సగటున ఈ కేంద్రంలో రెండు వేల క్వింటాళ్ల (ఏడు వేల బస్తాల) ధాన్యం రైతులు నుంచి కొనుగోలు చేయటంలో ముందంజలో ఉన్నారు. నాలుగు రోజుల వ్యవధిలోనే మల్లిక గ్రామ సమాఖ్య ఆధ్వర్యంలో ఏడు వేల క్వింటాళ్ల ధాన్యం (17 వేల బస్తాలు) కొనుగోలు చేశారు.

14 సంవత్సరాలుగా నిర్వహణ

మండలంలోని పుల్లయ్యబంజరులోని శివాలయ ప్రాంగణంలో 2014లో ప్రారంభమైన ఈ కొనుగోలు కేంద్రం 14 సంత్సరాలుగా నిర్వహిస్తున్నారు. సాగర్ జలాలను ఆధారంగా చేసుకొని కల్లూరు మండలంలో ప్రతీ ఏడాది వానాకాలం, యాసంగి సీజన్లలో రెండు విడతలుగా వరి పంటను ఈ ప్రాంతంలో రైతులు సాగుచేస్తారు. ఇలా జిల్లా స్థాయిలోనే కల్లూరు మండలం వరి సాగులో అగ్రగామిగా నిలిచింది. ప్రభుత్వం తరుపున మద్దతు ధరను పొందేందుకు గాను రైతులంతా తమ ధాన్యాన్ని ఈ కేంద్రానికి తరలించడానికి ఆశక్తి చూపుతున్నారు.

పూర్తి బాధ్యత నిర్వాహకులదే

ఈ కేంద్రానికి గాను కల్లూరు, పుల్లయ్యబంజరు, కిష్టయ్యబంజరు, లోకవరం గ్రామాల చెందిన రైతులు తమ ధాన్యాన్ని తరలిస్తారు. కేంద్రానికి ధాన్యం రైతుల తరలించి రాశులుగా పోసి ఆరబెట్టిన తరువాత తేమ శాతం పరిశీలన, కాంటావేయటం, దిగుమతికి కేటాయించిన మిల్లులకు తరలించే వరకు అన్ని తామై మల్లిక సమాఖ్య నిర్వాహకుల పర్యవేక్షణ చేస్తున్నారు. రైతులకు నగదు బిల్లులు తయారు వరకు బాధ్యతలు నిర్వర్తిసారు.

మహిళల సమష్టి కృషి

ఈ వానకాలం సీజన్‌లో సుమారు 40 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని మల్లిక గ్రూపు సభ్యులు చెప్తున్నారు. దీంతో జిల్లాలోనే ఇంత పెద్ద మొత్తంలో ధాన్యం కొనుగోలు చేసే కేంద్రంలో పుల్లయ్యబంజరు మల్లిక గ్రూపు ఆదర్శంగా నిలించింది. ప్రతి ఏడాది ధాన్యం కొనుగోలులో తాము చేసిన సేవకు గాను రూ.2లక్షల వరకు కమీషన్ అందుతుందన్నారు. అందులో కేంద్రం నిర్వహణ ఖర్చులను కొంత మినహాయింపు చేయాల్సి ఉంది. ఈ ధాన్యం కొనుగోలులో మల్లిక గ్రూపు తరుపున కేంద్రం ఇన్‌చార్జిగా పెద్దబోయిన రామలక్ష్మి బాధ్యతలు నిర్వరిస్తుండగా, బుర్రీ లక్ష్మి, రంగు నాగమణి, నున్న రజనీ, వాసిన్ని భద్రమ్మ కలిసి ఈ కేంద్రం నిర్వహణ చూస్తారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ఎంత కష్టమైనా... ధైర్యంగా ఉండి విజయంతంగా ఈ కేంద్రాన్ని నడపటంలో జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు.

ధాన్యం కొనుగోలులో రైతులకు సేవలందిస్తాం

పెద్దబోయన రామలక్ష్మి, మల్లిక గ్రూపు సమాఖ్య ఇన్‌చార్జి



ధాన్యం కొనుగోలులో ఎంత కష్టమైన కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. మల్లిక గ్రూపు సమాఖ్య ధాన్యం కేందాన్ని గత 14 సంత్సరాలుగా నిర్వహిస్తున్నాం. ధాన్యం కొనుగోలు నుంచి కేటాయించి మిల్లులకు ధాన్యం రవాణా వరకు అన్ని బాధ్యతలు నిర్వర్తిస్తూ రైతులకు సేవలందించడం సంతృప్తి ఉంది.

బీసీ రిజర్వేషన్లపై నెలలో నివేదిక

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల అమలుపై ఉమ్మడి జిల్లాలోని వివిధ సంఘాల ప్రతినిధుల నుంచి సేకరించిన ప్రతిపాదనలు, అభిప్రాయాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం నెలలో నివేదిక అందించనున్నామని తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేషన్ కమిటీ చైర్మన్ భూసాని వెంకటేశ్వరరావు తెలిపారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఆదివారం ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని వివిధ సంఘాల నుంచి స్థానిక సంస్థల రిజర్వేషన్ దామాషాపై అభిప్రాయాల సేకరణ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమవేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ అమలు చేసేందుకు వివిధ సంఘాలనుంచి వచ్చిన ప్రతిపాదనలను క్రోడీకరిస్తూ నివేదికను ప్రభుత్వానికి నిర్ణీత సమయంలో అందిస్తామన్నారు. అనంతరం వివిధ సంఘాలు, వ్యక్తుల నుంచి విజ్ఞప్తలను స్వీకరించారు. చైర్మన్‌కు వడ్డెర సంఘం ప్రతినిధులు, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ, ముస్లిం, మైనారిటీ, మత్యకారుల సంఘం, దూదేకుల సంఘం, గంగపుత్ర సంఘం, పూసల, చాకలి, యాదవ, కురుమ, సంచార ముస్లిం, కుమ్మరి, ఎంబీసీ సంఘాల ప్రతినిధులతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ దామాషా అమలు, వారి వర్గాలకున్న వివిధ సమస్యలపై అభిప్రాయాలు తెలుపుతూ వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కింద వృత్తుల జనాభా వివరాలు, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ కింద నమోదు చేసి గుర్తించాలని చైర్మన్‌ను కోరారు.

కోఆపరేటివ్ సొసైటీ యాక్టుకింద నిర్వహించే ఎన్నికల్లో రిజర్వేన్లపై పలువురు విన్నవించగా ఆ ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం పరిధిలోకి రావని, ఆ అంశం తమ పరిధిలో లేదని సూచించారు.

ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సెక్రటరి బి.సైదులు, ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు బి.రమేష్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాల బీసీ సంక్షేమశాఖ అధికారులు జి.జ్యోతి, ఇ.ఇందిర, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత, సహాయ బీసీ సంక్షేమాధికారులు, వసతిగృహ సంక్షేమాధికారులు, వివిధ సంఘాల నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, బాషా తదితరులు పాల్గొన్నారు.



దారికి అడ్డంగా ముళ్ల కంచె వేసిన ఆదివాసీ రైతులు

దారి ఇవ్వాల్సిందే...

- వ్యవసాయ భూముల్లోకి మార్గం కోసం నిరసన
- ప్రధాన రహదారిపై కంచె వేసిన ఆదివాసీలు

చండ్రుగొండ, నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తమ వ్యవసాయ భూముల్లోకి దారి ఇవ్వాలని లేదంటే రైతులను ఎవరని వారి వ్యవసాయ భూముల్లోకి వెళ్లనిచ్చేది లేదంటూ ప్రధాన రహదారికి అడ్డంగా ఆదివాసీ రైతులు ముళ్ల కంచె, టెంటు వేసి నిరసనకు దిగారు. ఈ సంఘటన మద్దుకూరు గ్రామ శివారుల్లో ఆదివారం చోటు చేసుకుంది. ఆదివాసీ రైతులు పద్దం జోగయ్య, రాఘవులు, నరేంద్ర, రాంబాబు తదితరులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 20 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం ఆదివాసీలకు 150 ఎకరాలను పంపిణీ చేసింది. అప్పటి నుంచి గ్రామంలోని రైతుల భూముల్లో నుంచే పట్టాలు పొందిన భూముల్లోకి రాకపోకలు సాగిస్తూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఈక్రమంలో ఇటీవల తమ భూముల్లో నుంచి నడవద్దంటూ గ్రామంలోని కొందరు రైతులు ఆదివాసీ రైతులను అడ్డుకొంటున్నారు. దీంతో ఆగ్రహించిన ఆదివాసీలు ప్రధాన రహదారికి అడ్డంగా కంచె వేశారు. దారి సమస్య పరిష్కరించే వరకు రైతులను నడవనిచ్చేది లేదని ఆదివాసీ రైతులు తెలిపారు.



రహదారిపై టెంటు వేసి నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీలు

ఓవరాల్ చాంపియన్‌గా కరీంనగర్

- జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక
- ముగిసిన అండర్-14 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గత మూడు రోజులుగా జరుగుతున్న 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-14 బాలుర, బాలికల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీలలో కరీంనగర్ జిల్లా జట్టు అన్ని విభాగాలలో అత్యుత్తమ ప్రదర్శన ప్రదర్శించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. బాలుర విభాగంలో ఆదిలాబాద్, బాలికల విభాగంలో కరీంనగర్ జట్లు ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను త్వరలో జార్ఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పాఠశాలల క్రీడా పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. పోటీల అనంతరం విజేతలకు డీఈవో సోమశేఖరశర్మ, డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, రాష్ట్ర ఎస్‌జీఎఫ్ అబ్జర్వర్ సోమశేఖర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి, అథ్లెటిక్స్ కోచ్ గౌస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ షఫీక్ అహ్మద్, వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, సైదేశ్వరరావు, పాపారావు, రవికుమార్, సుజాత, రోజా, రాజేశ్వరి, ఆదర్శ్‌కుమార్, రామారావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే

బాలుర జట్టు... రాథోడ్ కార్తీక్(ఆదిలాబాద్), కర్రి ప్రవీణ్(నల్గొండ), నగేష్(ఆదిలాబాద్), బాచీ(వరంగల్) సాయిఆదిత్య (రంగారెడ్డి), జాకేష్ (ఆదిలాబాద్), కె. లక్కీ(వరంగల్), సాత్విక్(ఆదిలాబాద్), బి. నరేష్(ఖమ్మం), మిట్టు(మహబూబ్‌నగర్), శ్రీకాంత్(మెదక్), ఎ. దిల్‌షన్ (మహబూబ్‌నగర్), ఎం. సాయిచైతన్య(కరీంనగర్), మనోజ్(ఆదిలాబాద్), డి. లోకేష్(ఖమ్మం)

బాలికల జట్టు...

జి. నక్షత్ర(కరీంనగర్) వై. శృతిహాసన్(ఖమ్మం), ఎండీ. సమీరా(కరీంనగర్), రాజేశ్వరి (వరంగల్), ఎం.ఏ. వినూత్న(హైదరాబాద్), జి. దాన్యశ్రీ(మెదక్), అన్వితానంద(రంగారెడ్డి), వెన్న సహారా(ఆదిలాబాద్), కే. సాయిశ్రీ(రంగారెడ్డి), ఎండీ. ఆస్మిన్(కరీంనగర్), శైలజ (ఆదిలాబాద్), వైష్ణవి(రంగారెడ్డి).

మధిరలో అఘోరీ ప్రత్యక్షం

- పాదాభివందనం చేసిన డిప్యూటీ సీఎం భట్టి సతీమణి



ఆశీస్సులు తీసుకుంటున్న మల్లు నందిని

మధిర, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా మధిరలో ఆదివారం మహిళా అఘోరీ ప్రత్యక్షమయ్యారు. మధిరలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అఘోరిని కలిసి పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. మధిరకు విచ్చేసిన అఘోరిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు వేళాయే..

- నేటి నుంచి జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్
- 900కు పైగా నమూనాలు
- ఎమ్మెల్యే జారే పర్యవేక్షణలో అన్నపురెడ్డిపల్లిలో ఏర్పాట్ల పూర్తి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అన్నపురెడ్డిపల్లి వేదికగా సోమవారం నుంచి నిర్వహిస్తున్న జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రదర్శన ప్రదేశానికి విక్రమ్ అంబాలా సారాబాయి వేదికగా నామకరణం చేశారు. గత వారం రోజులుగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యేక్షణలో అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమించి ఏర్పాట్లు పూర్తిచేశారు. కాగా 18 నుంచి 20 వరకు జరగనున్న వైజ్ఞానిక ప్రదర్శనపై ఎమ్మెల్యే ఆదివారం వేదిక వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాజ్య స్థరీయ బాల్ వైజ్ఞానిక ప్రదర్శనకు అంతా సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ వేదికలో 900లకు పైగా ప్రదర్శనలు రానున్నాయన్నారు.

ఈ కార్యక్రమం ప్రారంభానికి ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రదర్శన జరిగే మూడు రోజుల్లో నలుగురు రాష్ట్ర మంత్రులు హాజరయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో నిర్వాహణ అధికారులతో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు పర్సా వెంటేశ్వరావు, మండల నాయకులు వనమా గాంధీ, శ్రీకాంత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఏలూరులో వినాయకపురం వాసి ఆత్మహత్య



అశ్వారావుపేట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలం, వినాయకపురం కాలనీకి చెందిన గుళ్ల సద్గుణరావు(35) అనే ఆటో మెకానిక్ ఏపీలోని ఏలూరులో రైలు పట్టాలపై తల పెట్టి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చనే ప్రచారం జరుగుతున్నప్పటికీ పూర్తి వివరాలు తెలియడం లేదు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... సద్గుణరావు వినాయకపురం కాలనీలో మెకానిక్ షాపు పెట్టుకొని జీవిస్తున్నారు. ఇతను శనివారం మధ్యాహ్నం తలనొప్పి వస్తోందని, ఆసుపత్రిలో చూపించుకోవాలని ఇంటివద్ద చెప్పి వెళ్లాడు. ఆదివారం తెల్లవారుఝామున ఏలూరులో రైలు ట్రాక్‌పై తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడినట్టు అక్కడి పోలీసులు ఆయన సోదరుడు ప్రసన్నబాబుకు ఫోన్‌ద్వారా తెలిపారు. మృతుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డును చూసి పోలీసులు వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏలూరుకు వెళ్లారు. ఆదివారం సాయంత్రానికి మృతదేహం పోస్టుమార్టం పూర్తికాలేదు. ఏలూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా సద్గుణరావుకు భార్య శాంతి, ఇద్దరు సంతానం ఉన్నారు. సంతానంలో ఒకరు నెల రోజులు పసికందు. ఈ సమాచారంతో వినాయకపురంలో విషాదం నెలకొంది.

గోదావరిలో దూకుతా..

- భద్రాచలం బ్రిడ్జి వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- చాకచక్యంగా రక్షించిన స్థానికులు

బూర్గంపాడు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): భద్రాచలం గోదావరి వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఒక వ్యక్తిని ఆదివారం అటుగా వెళ్తున్న వ్యక్తులు కాపాడారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బూర్గంపాడుకు చెందిన ఇద్దరు విలేకరులు ఘనీ, జాకీర్‌లు భద్రాచలం నుంచి సారపాక వైపు వెళ్తుండగా ఓ వ్యక్తి గోదావరి వంతెనపై కూర్చుని నదిలోకి దూకేందుకు ప్రయత్నిస్తుండటాన్ని గమనించారు. దీంతో వారు కొంత దూరంలో ఆగి అతడిని చాలాసేపు వారించినా వినకుండా దగ్గరకు వస్తే దూకుతానని బెదిరించాడు. ఇంతలో బైక్‌పై అటుగా వెళుతున్న మరో వ్యక్తి అతడి వద్ద బండి ఆపి వెనుక నుంచి గట్టిగా పట్టుకుని కిందకు లాగడంతో ప్రమాదం తప్పింది. ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆత్మహత్యనుంచి ఓ వ్యక్తిని కాపాడిన వారిని స్థానికులు అభినందించారు.

కడుపునొప్పి తాళలేక విద్యార్థిని ఆత్మహత్య

పాల్వంచ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలోని గొల్లగూడేనికి చెందిన బానోతు వెన్నెల(16) నవభారత్ ప్రాంతంలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. గత సంవత్సరం నుంచి కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలోనే శుక్రవారం కడుపునొప్పి తీవ్రంగా రావడంతో తట్టుకోలేక ఇంట్లో పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి ..

పాల్వంచ, నవంబరు 17 ఆంధ్రజ్యోతి: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. శివనగర్‌లో నివాసముంటున్న ఎడవల్లి విద్యాసాగర్(58) ఎన్ఎండీసీ కర్మాగారంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. గత కొంత కాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. శనివారం అర్ధరాత్రి ఇంటి ముందు వరండాలో కుటుంబ సభ్యులు అందరూ నిద్రిస్తుండగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య కేసు నమోదు చేశారు.

సీఎస్ఐ చర్చిలో అగ్నిప్రమాదం

వైరా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి: మండలంలోని విప్పలమడకలో ఉన్న సీఎస్ఐ చర్చిలో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. రూ.ఆరులక్షల వరకు ఆస్తినష్టం సంభవించిందని నిర్వాహకులు తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. రెండు బీరువాలు, కిటికీలు, 14 ఫ్యాన్లు, 20 ట్యూబ్‌లైట్లు, వంద కుర్చీలు, ఐదు బెంచీలు, సౌండ్‌బాక్సులు, డెకరేషన్ సామగ్రి కాలిపోయింది. అర్ధరాత్రి ప్రమాదం జరగడం వలన పెనుప్రమాదం తప్పింది.

వ్యవసాయ మోటార్ల దొంగల అరెస్టు

- 20కిలోల కాపర్‌వైరు, రూ.70వేల నగదు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు

కూసుమంచి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో వ్యవసాయక్షేత్రాల్లో రైతుల మోటార్లను చోరీ చేస్తున్న దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలను కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ నాగరాజు విలేకరులకు వివరించారు.

కూసుమంచి శివాలరులోని క్రషర్ మిల్లు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటార్‌సైకిల్‌పై అనుమానాస్పదంగా వస్తున్న శివ, లచ్చు అనే ఇద్దరు వ్యక్తులను గుర్తించారు. వారిని తనిఖీ చేయగా 20కిలోల కాపర్‌వైరును గుర్తించారు. విచారించగా పాలేరు సమీపంలో చోరీలకు పాల్పడినట్లు అంగీకరంచారు.

పథకం ప్రకారం దొంగతనం చేసిన మోటార్లలోని కాపర్ వైరును తీసి నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన నాగేశ్వరరావుకు విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారని పేర్కొన్నారు. అతను హైదరాబాద్‌కు చెందిన యాది ఎలియాస్ మహేష్‌కు విక్రయించగా వచ్చిన దొంగసొమ్ము రూ.70వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మొత్తం 28మోటార్లు దొంగిలించి అందులోని కాపర్‌వైరు స్క్రాప్ సుమారు రూ.3వేలకు విక్రయించినట్లు తెలిపారు. ఈమేరకు నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన దానబోయిన నాగేశ్వరరావు, మోతె మండలం రాయకుంటతండాకు చెందిన భూక్యాశంకర్, మోతెమండలం గోపతండాకు చెందిన గుగులోతు లచ్చు, అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు చెందిన యాది ఎలియాస్ మహేష్ పరారీలో ఉన్నారని తెలిపారు. ఈసందర్భంగా మోటార్ల దొంగలను అత్యంత చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ నాగరాజును, కానిస్టేబుల్స్ శ్రీశైలం, గోపి, హోంగార్డులు రాంబాబు, రమేష్‌ను సీఐ అభినందించారు.

ముగిసిన మధిర బాలోత్సవ్ పోటీలు



బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మధిర, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మధిరలో రెండు రోజులపాటు నిర్వహించిన జాతీయ స్థాయి బాలోత్సవ్ పోటీలు శనివారం అర్ధరాత్రి ఘనంగా ముగిశాయి. ఆదివారం విజేతల వివరాలను నిర్వాహకులు ప్రకటించి విజేతలకు బహుమతులను అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని పలు గ్రామాల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. కూచిపూడి జూనియర్స్‌విభాగంలో వాణి విద్యానికేతన్ విద్యార్థిని, వరంగల్‌కు ప్రథమ బహుమతి రాగా, ద్వితీయ బహుమతి నిర్మల్ హృదయ్ స్కూల్, ఖమ్మం విద్యార్థిని గెలుపొందింది. సీనియర్స్ విభాగంలో ఎస్వీ ఎస్వీ ఇంగ్లీష్‌మీడియం పాల్వంచ విద్యార్థిని ప్రథమ బహుమతి, శ్రీచైతన్య స్కూల్, ఖమ్మం విద్యార్థిని ద్వితీయ బహుమతి గెలుపొందారు. భరతనాట్యం విభాగంలో హార్వెస్ట్ హైస్కూల్, ఖమ్మం విద్యార్థి ప్రథమ, హార్వెస్ట్ టెండర్ స్కూల్ విద్యార్థిని ద్వితీయ బహుమతులు గెలుపొందారు. సీనియర్స్ విభాగంలో డీపీవీ స్కూల్, పాల్వంచ విద్యార్థి ప్రథమ, భరత్ టెక్నోస్కూల్, మధిర విద్యార్థి ద్వితీయ బహుమతులు గెలుపొందారు. నీతి పద్యాలు, ఏకపాత్రలు, ఉపన్యాసాలు పోటీలలో విజేతలకు నగదుబహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమాల్లో సంస్థ అధ్యక్షుడు పుతుంబాక శ్రీకష్ణప్రసాద్, కార్యదర్శి బాబ్జా, న్యాయనిర్ణేతలు తాటికొండాల నర్సింహారావు, పాకలపాటి రోశయ్య చౌదరి, కమిటీ సభ్యులు, పలువురు దాతలు, ఎన్ఆర్ఐ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

- నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ఖమ్మంటౌన్, నవంబజుజీ 17(ఆంధ్రజ్యోతి): భారతవిద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో ఫిబ్రవరిలో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు తెలిపారు. ఆదివారం నగరంలోని డీపీఆర్సీ భవన్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ అధ్యక్షతన ఆహ్వాన సంఘం ఏర్పాటు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ 22ఏళ్ల తర్వాత ఖమ్మంజిల్లాలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో యూనివవర్సిటీ విద్యనుంచి పాఠశాల విద్యవరకు ఈమహాసభలో చర్చిస్తామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు లేక మూతపడుతున్న పాఠశాలల విషయంపై కూడా మహాసభ చర్చిస్తుందన్నారు. ప్రముఖ విద్యావేత్తలు ఐవీ రమణరావు రవిమారుత్, కాంతారావులు మాట్లాడుతు జిల్లా అనేక ప్రజా ఉద్యమాలకు నెలవుగా మారిందని, 2002లో ఎస్ఎఫ్ఐ తన 14వ రాష్ట్ర మహాసభలు ఇక్కడే నిర్వహించిందన్న విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలో విద్యారంగసమస్యల పరిష్కారనానికి సెంట్రల్ యూనివర్సిటీల్లో సైతం ఎస్ఎఫ్ఐ పోరాడుతుందని ఈమహాసభల విజయవంతానికి తాము కూడా సహకరిస్తామన్నారు రైతుసంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు,ఐద్వా రాష్ట్ర నాయకులు బుగ్గవీటి సరళలు మాట్లాడుతూ నూతన విద్యావిధానం రద్దు కోసం పోరాడాల్సిన నిర్ణయాలను ఈమహాసభలో చర్చించాలని కోరారు. మహిళలు, విద్యార్థినులపై దాడులు రుగుతున్న నేపథ్యంలో ఇటువంటి అంశాలను రాష్ట్ర మహాసభలో చర్చించి భవిష్యత్‌కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వ గెజిటెడ్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు కొప్పిశెట్టి సురేష్, విజయలక్ష్మి, ట్రస్మా నాయకుడు నాయుడు వెంకటేశ్వరరావు, తదితరులు మాట్లాడుతూ ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మమాసభలు నిర్వహించడం అభినందనీయమన్నారు అనంతరం మహాసభల జయప్రదం చేయాలని కోరుతూ ఆహ్వాన సంఘాన్ని ఎస్ఎఫ్ఐజిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ ప్రతిపాదించా ఆమోదం తెలిపారు. ఈసమవేశంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు భూక్యా వీరభద్రం, వై. విక్రం మెరుగు సత్యనారాయణ, బండారు రమేష్, యర్రా శ్రీనివాసరావు, జబ్బార్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ , నాయకులు సాయికుమార్, ప్రేమ్‌కుమార్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు

పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పరిశీలించిన సీపీ

ఖమ్మంక్రైం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదివారం పరిశీలించారు. కమిషనరేట్ పరిధిలో 87 పరీక్ష కేంద్రాలలో గ్రూప్-3 పరీక్ష జరుగుతున్న నేపథ్యంలో నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు.



అధికారులకు సూచనలు చేస్తున్న సీపీ సునీల్‌దత్



బారులుతీరిన పత్తిలోడు వాహనాలు

సీసీఐ కేంద్రాలకు సం'పత్తి'

కారేపల్లి, నవంబరు17: (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల సీసీఐ పత్తి కేంద్రానికి అధికారులు మూడురోజులు సెలవులు ప్రకటించారు. సోమవారం నుంచి సీసీఐ కేంద్రంలో రైతులనుంచి అధికారులు పత్తి కొనుగోలుచేస్తామని ప్రకటించారు. అయితే ఒక రోజు ముందుగానే ఆదివారమే వివిధ ప్రాంతాల నుంచి పత్తిలోడుతో ఉన్న వాహనాలను కేంద్రం వద్దకు తీసుకొచ్చారు. సోమవారం వస్తే తమ వెనుకబడిపోతామనే ఉద్దేశంతో ముందురోజునే పత్తిలోడుతో ఉన్నవాహనాలు రైతులు తీసుకవచ్చారు.





శ్రీకవిత విద్యాసంస్థల అధినేత పారుపల్లి ఉషాకిరణ్,విజయలక్ష్మిల కుమార్తె శ్రీకవిత, మోహిన్షల వివాహ రిసెప్షన్ తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	44రూ.
వంకాయ	48
గుత్తి వంకాయ	50
బీరకాయ	54
పచ్చిమిర్చి	34
కాకరకాయ	28
బెండకాయ	30
పొట్లకాయ	40
దోసకాయ	44-58
నాటుచిక్కుడు	120
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	38
దొండ	30-40
సొరకాయ	28
క్యారెట్	78
క్యాప్సికం	64
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	170
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

శ్మశానవాటిక స్థలం కబ్జా?

పరిరక్షించాలని స్థానికుల పోరాటం

ఖానాపురం శ్మశానవాటిక కబ్జా స్థలాన్ని పరిశీలించిన కేఎంసీ, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



కబ్జాకు గురైన శ్మశాన వాటిక స్థలం

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలో కబ్జాదారుల ఆగడాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ప్రభుత్వ భూములు, ప్రైవేట్ ఇళ్ల స్థలాలను కబ్జా చేసిన వారు ఇప్పుడు ఏకంగా శ్మశాన వాటికలను వదల బొమ్మాళీ అని అక్రమంగా ఫెన్సింగ్ వేసి కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో శ్మశాన వాటికను పరిరక్షించేందుకు స్థానికులు నెల రోజులుగా పెద్ద స్థాయిలో పోరాటాలు చేయటంతో ఇప్పుడు ఖానాపురం శ్మశాన వాటిక చర్చనీయాంశంగా మారింది.

ఖమ్మం నగరంలోని సర్వే నెంబర్ 88లో ఖానాపురం శ్మశాన వాటిక ఐదు దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఒక వైపు హైదరాబాద్, రాజమండి ప్రధాన రహదారి మరో వైపు ఎన్ఎస్పీ కాల్వ మధ్య ఉన్న స్థలాన్ని శ్మశాన వాటికగా గతంలో గుర్తించారు. టేకులపల్లి, లక్ష్మీనగర్, రోటరీనగర్, ఇందిరానగర్, చైతన్యనగర్, ఖానాపురం, వీడియోస్ కాలనీల సమీప ప్రాంతాల నుంచి మృతదేహాలకు ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. గతంలో రెండు ఎకరాల మేరకు ఉన్న శ్మశాన వాటిక ఇప్పుడు కేవలం 3వేల గజాలకు పరిమితమైంది. అందులోనే కొందరూ 500 గజాల స్థలం మాదే అంటూ ఫెన్సింగ్ వేశారు. దీంతో 14మందితో కూడిన స్థానికులు శ్మశాన వాటిక పరిరక్షణకు నెల రోజులుగా పోరాటాలు చేస్తున్నారు. ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను కలుస్తూ శ్మశాన వాటికను పరిరక్షించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే పోలీసు, ఖమ్మం నగర పాలక పట్టణ ప్రణాళిక అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి శ్మశాన వాటికకు ఫెన్సింగ్ వేసిన వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

ముగిసిన ఈశా గ్రామోత్సవం క్రీడా పోటీలు



మహిళల త్రోబాల్ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన కోయచలక జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రెండు రోజులుగా జరిగిన ఈశా గ్రామోత్సవం గ్రామీణ క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీలలో భాగంగా త్రోబాల్‌లో కోయచలక వారియర్స్ జట్టు ప్రథమ బహుమతి సాధించగా, పాపటపల్లి ఫైటర్స్ జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. వాలీబాల్ విభాగంలో ఫాబియన్‌యూత్ అన్నారుగూడెం జట్టు విజేతగా నిలవగా, పీపీఎల్ బాయ్స్ పోలంపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. పోటీల అనంతరం విజేత జట్లకు నగర ఏసీపీ సుశీల్‌సింగ్, డీవైఎస్వో సునిల్‌రెడ్డి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఈశా నిర్వాహకులు నవీన్, వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	అపుడో ఇప్పుడో ఎపుడో
ఆదిత్య:	క
తిరుమల:	దేవర
సినీ గెలాక్సీ:	ధూంధాం

ఎన్నికల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న అచ్చయ్య

తిరుమలాయపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆవగ్దానాలు అమలుచేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్రనాయకులు గుర్రం అచ్చయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మడలంలోని పిండిప్రోలులో రాయల వెంకటనారాయణ భవనంలో పి.వెంకటస్వామి అధ్యక్షతన డివిజన్ స్థాయి జనరల్‌బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నియంత పాలనపోయి కాంగ్రెస్ పాలన వచ్చి ఆపార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నో వాగ్దానాలు చేసిందన్నారు. అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు ఇవ్వాలన్నారు. కొత్త పింఛన్లు మంజూరులేదన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు ఈకార్యక్రమంలో ఆపార్టీనాయకులు బందెల వెంకయ్య, కమ్మ కోమటి నాగేశ్వరరావు , తిమ్మిడి హనుమంతరావు,ఎస్.వెంకటేశ్వర్లు, ఆర్.వెంకన్న, జి.స రోజన, మీగడ సత్యం,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డిపో తెరుచుకునేదెన్నడో?

రెండేళ్లకు పైగా మూసివేసిన నిర్వాహకులు

పట్టించుకోని టీజీఎండీసీ అధికారులు



మూసి ఉన్న టీఎస్ఎండీసీ ఇసుక డిపో

ఖమ్మం ఖానాపురం హవేలి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు కూడ ఇసుక తక్కువ ధరకు విక్రయించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇసుక డిపోలను ఏర్పాటుచేసింది. అయితే ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన టీజీఎండీసీ (తెలంగాణ స్టేట్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఇసుక డిపో మూతపడి రెండేళ్లు అవుతోంది. ఈ ఇసుక డిపో తెరుచుకొనేది ఎప్పుడో తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు ఇసుక వ్యాపారుల సూచనల మేరకే ఇసుక డిపోలో ఇసుకను బహిరంగ మార్కెట్ కంటే అధిక ధరకు విక్రయించడంతో ఇంటి నిర్మాణదారులు ప్రభుత్వ ఏర్పాటుచేసిన డిపో వైపు రావడం తగ్గించారనే వాదన బలంగా వినిపిస్తోంది. తక్కువ ధరకు ఇసుక అందకుండ టీజీఎండీసీ అధికారులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బహిరంగ మార్కెట్ కంటే అధిక రేట్లు

ఇసుక కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం టీజీఎండీసీ ద్వారా ఇసుక తక్కువ ధరకు అమ్మేందుకు డిపోలను ఏర్పాటు చేసింది. అవసరమైన మేరకు ఇసుకను సరఫరా చేస్తుంది. దీనిలో భాగంగా జిల్లాలో 2018 డిసెంబరు 31న ఖమ్మం గ్రామీణ ప్రాంతం పోలేపల్లి సమీపంలో ఇసుక డిపో ఏర్పాటు చేశారు. సొంతంగా ఇల్లు నిర్మించుకునే వారు జిల్లాలోని బిల్డర్లు ఇసుక డిపో ఏర్పాటుచేయడంతో కొంత అవసరానికి తగ్గట్టు ఇసుక దొరుకుతుందని ఆనందించారు. కానీ ఇసుక డిపో ప్రారంభమైన నాటినుంచి ఏనాడు కూడా ఏడాదిలో రెండు నుంచి మూడు నెలలు తీసి ఉన్న పాపాన పోలేదు. ఈ విషయంపై టీఎస్ఎండీసీ అధికారులను ఎన్నిసార్లు అడిగినా. సాకులు చెబుతూ ఇసుక డిపో మూసివేస్తున్నారు. అనంతరం 2020 నవంబరులో నగరంలోని నూతన బస్టాండ్ పక్కకు మార్చారు. కొన్నినెలల అనంతరం డిపోను మూసివేశారు. డిపోలో ఇసుక డిపో క్యూబిక్ మీటరు రూ.2100 ఉండేది. దీనికి జీఎస్టీ అదనం. ఒక్కో ట్రాక్టరుకు (మూడు క్యూబిక్ మీటర్లకు) రూ.6700 చెల్లించాలి. ఒక్కో క్యూబిక్ మీటరు లో 1.5 టన్ను ఇసుక ఉంటుంది. ట్రాక్టర్లో మూడు క్యూబిక్ మీటర్లు అంటే 4.5 టన్నుల రేటు రూ.6750 ఉంటుంది. దీనికి ట్రాక్టర్ కిరాయితో కలిపి రూ.7500 వరకు విక్రయించేవారు. అయితే బహిరంగ మార్కెట్లో టన్ను ఇసుక రూ. 1050నుంచి రూ.1100 వరకు మాత్రమే లభిస్తోంది. ట్రాక్టర్ ఇసుక రూ.5వేలకే దొరుకుతుంది. రెండు వేల రూపాయల తేడాతో టీఎస్ఎండీసీ ఇసుక అధిక ధరకు అమ్మాలని నిర్ణయించటంతో నిర్మాణదారులు డిపో ఇసుకకు కొనుటకు ముందుకు రావటంలేదు.

వర్షాకాలంలో డిమాండ్ అధికం

వర్షాకాలం నదులు, వాగులు పొంగి ఇసుక లభించటం కష్టంగా మారుతుంది. ఈ సమయాల్లో ఎండాకాలం టీజీఎండీసీ ఇసుక డిపోల్లో ఇసుకను ముందుగానే డంప్ చేసి తక్కువ ధరకు ఇంటి నిర్మాణధారులకు అందిచాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకుండ ఇసుక కొనేందుకు ఎవరు ముందుకు రావటం లేదనే సాకుతో డిపోలో ఇసుక అందుబాటులో లేకుండ చేస్తున్నరనే వాదనలు వినపడుతున్నాయి. సాధారణంగా ఇళ్ల నిర్మాణ దారులు ఇసుకను తమకు చౌకగా సరఫరా చేసే ప్రైవేటు వ్యక్తుల వద్ద కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతారు. అయితే వర్షాకాలంలో మాత్రం ఇసుకను ప్రైవేటు వ్యక్తులు మాత్రం విక్రయించేందుకు ముందుకు రారు. వానల సమయంలో ఇసుక లభించడం కష్టం కనుక ప్రైవేటు వ్యక్తులు సరఫరా చేయరు. ఆ సమయంలో కేవలం ప్రభుత్వ ఇసుక డిపోలో మాత్రమే ఇసుక అందుబాటులో ఉంటుంది. అయితే ప్రస్తుత వానాకాలంలో సీజన్లో ఇసుక డిపో మూసి ఉండటంతో ఇసుక లభించడం లేదు. గత ఏడాది కూడా ఇసుక డిపోలోని ఇసుకను ఒక్క వర్షాకాలంలో తప్పా మిగిలిన కాలాల్లో పెద్దగా అమ్మిన దాఖలాలు లేవు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఒక్క వర్షాకాలంలోనే ఇసుక డిపోలోని ఇసుకను కొనేందుకు ఇంటి యజమానులు ఆసక్తి చూపతున్నారు. వర్షాకాలంలో నదులలో నీరు అధికంగా ప్రవహించి ఇసుక దొరకడం కష్టమవుతుంది. కనుక డిపోలో ఇసుక కొనేందుకు మొగ్గు చూపిస్తున్నారు. అయితే డిపో మూతపడటంలో ఆ అవకాశం లేకుండా పోయింది.

జిల్లా కేంద్రంలో ఇసుక మాఫియా

జిల్లా కేంద్రంలో ఇసుక మాఫియా జోరుగా వ్యాపారం నడుస్తోంది. రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. నగరంలోని బైపాస్ రోడ్డ ప్రాంతంలో, కరుణగిరి ప్రాంతంలోని బహిరంగ ప్రదేశాలలో అనధికారిక ఇసుక డిపోలను ఏర్పాటు చేశారు. వ్యాపారులు ఒక్కో లారీలో 10 నుంచి 45 టన్నుల ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇసుక క్వారీలకు అనుమతి లేకున్నా అక్రమ ఇసుక క్వారీయింగు దళారులు తెరలేపుతున్నారు. అర్ధ రాత్రి పూట తెగబడుతున్నారు. జిల్లాలోని చిన్న మండువ. పెద్దమండువ, చింతకాని, బోనకల్, వైరా పాలేరు. ఖమ్మం మున్నేరు తదితర ప్రాంతాల్లో అర్ధరాత్రి ఇసుకకు తవ్వుతున్నారు. చీకటిలో కూలీల సాయంతో ట్రాక్టర్లతో లోడింగ్ చేస్తున్నారు. వాగులు, వంకలు, నది గర్భాలను తవ్వుతూ ఇసునుకను దోచుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం టీజీఎండీసీ ఇసుక డిపోను తెరిచి ఇంటి నిర్మాణదారులకు బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు నాణ్యమైన ఇసుకను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రైవేట్ పనులకు పంచాయతీ ట్రాక్టర్

ఓపార్టీ నేత కోళ్లఫారమ్ నీళ్లకు వినియోగం

గ్రామస్థుల ఆగ్రహం

రఘునాథపాలెం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారిన రఘునాథపాలెం మండలంలో నాయకులు తీరు మాత్రం మారలేదు. రేగులచెలక గ్రామ పంచాయతీకి ప్రభుత్వం ట్రాక్టర్‌ను అందించింది. గ్రామ పంచాయతీ అవసరాలకు వినియోగించాల్సిన ట్రాక్టర్ గ్రామంలోని ఓ పార్టీ నాయకులు నిర్మాణం చేస్తున్న కోళ్లఫారమ్‌కు నీళ్ల సప్లయ్ చేస్తోంది. గత పది రోజులుగా ఇలానే ట్రాక్టర్ దుర్వినియోగం జరుగుతుంది. అధికారులు స్పందించి ట్రాక్టర్ దుర్వినియోగాన్ని నిర్మూలించి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా పంచాయతీ ట్రాక్టర్‌ను వ్యక్తిగత అవసరాలకు వాడకూడదని, కార్యదర్శిని వివరణ కోరతామని తెలిపారు.



కోళ్లఫారమ్ నిర్మాణ స్థలంలో ఉంచిన ట్రాక్టర్, ట్రాలీ

వందేళ్ల పోరాట చరిత్ర సీపీఐది

పెనుబల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) వందేళ్ల పోరాట చరిత్ర అజరామమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని లింగగూడెం, గట్టుగూడెం గ్రామాల్లో సీపీఐ 100 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పురాతన పార్టీ సీపీఐ అని, డిసెంబరు 25నాటికి వందో సంవత్సరంలోకి అడుగుపెడుతుందన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై పడుకొని ఉన్న ఆవును ఢీకొని గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటనపై ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ నందు ఆదివారం రాత్రి కేసు నమోదైంది. ముస్తఫానగర్‌కు చెందిన మేడేపల్లి రవితేజ(32) గత నెల 30న పనిపై బయటకు వచ్చి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా బోనకల్ క్రాస్‌రోడ్డు సమీపంలో రోడ్డుపై ఉన్న ఆవును ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు వన్‌టౌన్ పోలీసులు కేసునమోదు చేశారు.

'రైతులను బలిపశువులు చేసే కుట్ర'

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ఫార్మా పరిశ్రమల ఏర్పాటు విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్‌లు రైతులను బలిపశువులను చేసే కుట్ర కనిపిస్తుందని వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్యా ఉపేంద్రబాయి, గౌరవాధ్యక్షురాలు షేక్ నజీమా పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధంగా పాలన సాగించిందని, నియంతృత్వ పోకడలతో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుందన్నారు. లగిచర్లలో ఫార్మ పరిశ్రమ ఏర్పాటు అంశం రైతుల ఏకాభిప్రాయంతోనే పరిష్కరించాలని వారు కోరారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

19న బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నవంబరు 19న ఉదయం 10 గంటల నుంచి, సాయంత్రం 4 గంటల వరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ కమీషన్ పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు జిల్లా మైనారిటి సంక్షేమ శాఖ అధికారి కె సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మైనారిటి మత గురువులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు ఎన్‌జీఓలు, ఇతర సంస్థలు, ప్రజలు పాల్గొని అభిప్రాయాలను తెలపాలని సూచించారు. సలహాలను, సూచనలను ఆరు సెట్లు ధృవీకరిణ అఫడవిట్ రూపంలో సమర్పించాలని తెలిపారు.

24న యాదవ వన సమారాధన



కరపత్రాలు ఆవిష్కరిస్తున యాదవసంఘ నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24న ఖమ్మం జిల్లా అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో నగరంలోని చెరుకూరి గార్డెన్స్‌లో వనసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనరసయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఏడాదివలే కార్తీక మాసంలో జరిగే విధంగా ఈఏడాది కూడా వనసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా యాదవ కుటుంబాలు పాల్గొనాలని కోరారు. అనంతరం వనసామరాధన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో చిత్తారు సింహాద్రియాదవ్, లొడిగ వెంకన్న, చేతుల నాగేశ్వరరావు, దుబాకుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అన్ని రకాల రక్షణ

ప్రీమెచ్యూర్ డే వాక్ ర్యాలీలో

అంకుర ఎండీ కృష్ణప్రసాద్



5కే వాక్ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నెలల నిండకుండానే జన్మించిన శిశువులను కాపాడుకునేందుకు అవగాహనే ముఖ్యమని, ప్రజల్లో ప్రీటర్మ్ బేబీలు ఎదుర్కొనే అనారోగ్య సమస్యలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా సరైన సమయంలో వైద్యం అంది అన్నీ రకాలుగా రక్షణ కలుగుతుందని అంకుర ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వున్నం కృష్ణప్రసాద్ అన్నారు. ప్రీమెచ్యూర్‌డే సందర్భంగా ఆదివారం అంకుర ఆసుపత్రి, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్(ఐఏపీ) సంయుక్త ఆధ్వర్యంలో లకారం ట్యాంక్‌బండ్ నుంచి అంకుర ఆసుపత్రి వరకు 5కే వాక్ ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీని ప్రారంభిచిన ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు నెలలు నిండకుండా పుట్టిన బిడ్డలకు చికిత్స అంతంతమాత్రంగానే ఉండేదనీ కారణంగా లక్షల మంది అనారోగ్య సమస్యలతో బాధపడేవారన్నారు. కానీ ప్రస్తుతం ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందనీ, దానిపై అవగాహన కలిగి ఉండటం ద్వారా ఆయా అనారోగ్య సమస్యల నుంచి బయటపడొచ్చన్నారు. ఐఏపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ముందస్తు జననం, వారి కుటుంబాలు పడే ఆందోళనపై భరోసా కల్పించేందుకు అవగాహన ముఖ్యమని, తద్వారా వారికి భరోసా కల్పించడంలో భాగంగానే 5కేవాక్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంకురా హస్పిటల్స్ బంజారాహిల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాద్, పీడియాట్రిక్ వైద్య నిపుణులు డాక్టర్ యలమంచిలి నాగమణి, ఐఏపీ జిల్లా కార్యదర్శి డాక్టర్ భరత్‌కుమార్, ట్రెజరర్ డాక్టర్ సాయిభార్గవ్, మోపర్తి సురేష్‌బాబు, శ్వేత, జ్యోత్న్స, రాజ్‌కుమార్, బాబురావు, జాకీర్, కల్పన, సాయిప్రసన్న, శివకుమార్, సింధు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్ష

ఖమ్మం రూరల్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూపు-3 పరీక్ష మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కోసం ఖమ్మం రూరల్ మండలంలో సాయిప్రభాత్‌నగర్ లోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల, వరంగల్ క్రాస్ రోడ్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్, మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, పొన్నేకల్లులోని అనిబీసెంట్ బీఈడీ కళాశాల, శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, సత్యనారాయణపురంలోని డేర్ కళాశాల, పెద్దతండాలోని కేజీబీవీ విద్యాలయం, కరుణగిరి సమీపంలోని హర్వెస్టు స్ప్రింగ్‌లీఫ్ పాఠశాల, కరుణగిరిలోని కారుణ్య విద్యాభవన్, ఆరెంపులలోని సెయింట్ లారెన్స్ డీఈడీ కళాశాల మొత్తం పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆయా కేంద్రాలలో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా పరీక్షలు నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆంధ్రజ్యోతి
ZONE
సోమవారం 18 నవంబరు 2024

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

వైరా-మధిర సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY



శ్రీకవిత విద్యాసంస్థల అధినేత పారుపల్లి ఉషాకిరణ్,విజయలక్ష్మి దంపతుల కుమార్తె శ్రీకవిత, మోహిన్షల వివాహ రిసెప్షన్ తనికెళ్లలోని విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

ప్రయాణికుల పాట్లు

» రిక్వెస్టు స్టాప్‌లో బస్సులు ఆగక ప్రయాణికుల ఇబ్బందులు



బస్సుల కోసం వేచి చూస్తున్న ఉద్యోగులు

ఏన్కూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద రిక్వెస్టు స్టాప్‌లో ఆర్టీసీ బస్సులు ఆగక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు ఈస్టాప్ ప్రభుత్వ కార్యాలయాలకు కూడలిగా ఉంది. పోలీసుస్టేషన్, గురుకుల పాఠశాల, కేజీబీవీ వి ద్యాలయం, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాల యం, వ్యవసాయ మార్కెట్, కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జూనియర్ కళాశాల, విద్యుత్ సబ్‌స్టేషన్, వెలుగు, ఐకేపీ ప్రభుత్వ కార్యాలయాలకు కేంద్రంగా ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఈస్టాప్ నుంచే ఉద్యోగులు ప్రయాణిస్తున్నారు. సుమారు 200 మంది ఉద్యోగులు ప్రయాణిస్తున్నారు. ఇక్కడి నుంచే నాచారం, రేపల్లెవాడ, మేడేపల్లి, భద్రు తండ, రామతండా గ్రామాలప్రజలు ప్రయాణిస్తుంటారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన దగ్గర నుంచి ఇక్కడ బస్సులు ఆపకపోవడంతో ప్రధాన సెంటర్ వరకు సుమారు కిలోమీటరు దూరం నడిచి వెళ్లలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళ్లలో అంత దూరం వెళ్లాలంటే మహిళ ఉద్యోగులు భయపడుతున్నారు. ఈవిషయమై అనేకసార్లు డిపో మేనేజర్లకు విన్నవించినా ఫలితం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సులు ఆపకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులు ఆపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కళాశాలకు సమయానికి వెళ్లలేకపోతున్నాం

● మోహన్, గురుకుల కళాశాల, అధ్యాపకుడు



ఆర్టీసీ బస్సులు ఆగక ఉద్యోగులు సమయానికి రాలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రధానసెంటర్ నుంచి కాలినడకన రాలేకపోతున్నారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు రాత్రి వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాత్రి వేళల్లో మహిళ ఉపాధ్యాయులు భయపడుతున్నారు. ఒక్కొక్కసారి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇకనైనా అధికారులు స్పందించి రిక్వెస్టు స్టాప్‌లో బస్సులు ఆపాలి.



మాట్లాడుతున్న దొండపాటి వెంకటేశ్వరరావు

సామాన్యులకు అందుబాటులోకి రిక్రియేషన్ క్లబ్ కల్యాణ మండపం

» డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు

మధిర, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మధిరలోని రిక్రియేషన్ కల్యాణ మండపం సామాన్యులకు అందుబాటులో ఆధునిక సదుపాయాలతో ఆధునికీకరించడం జరిగిందని డీసీసీబ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం కల్యాణమండపాన్ని టీడీపీ నేత డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్‌లచేతుల మీదుగా కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్లబ్ సభ్యుల సహకారంతో పట్టణ నడిబొడ్డున అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా సదుపాయలు కల్పించడం జరిగిందని దీన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు కౌన్సిలర్ కట్టా గాంధీ, చల్లా సత్యనారాయణ, సూరిబాబురెడ్డి, ములకలపల్లి మోహన్‌రావు, కరివేద సుధాకర్, మొండితోక జయాకర్, తదితరులున్నారు.

ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ భారవి

వైరా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైరాలోని సీపీఎం కార్యాలయంలో క్రమం తప్పకుండా 113వ నెల ఆదివారం బోడేపూడి కళానిలయం ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ చీకటి భారవి, పిల్లలమర్రి సుబ్బారావు రోగులను పరీక్షించారు. బొంతు రాంబాబు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, బొంతు సమత పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో హోమియో వైద్యశిబిరం

ఏన్కూరు, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఏన్కూరు గురుకుల విద్యాలయంలో అపోలో హోమియో, ఐఐహెచ్‌పీ, పూర్వ విద్యార్థుల అసోసియేన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈశిబిరాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈశిబిరంలో ఎస్‌బీఎల్ హోమియో మెడికల్ కంపెనీ అండ్ అపోలో హోమియో రోటరీనగర్ వారి సహకారంతో సుమారు రూ.లక్ష విలువైన మందులను విద్యార్థులకు అందించారు. ఈకార్యక్రమంలో కొత్తగూడెం హోమియో వైద్యులు ఎస్‌వీ స్వామి, మారెబాబు, రామచంద్ర డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తుల కృష్ణయ్య, డ్యాన్సుమాస్టర్ వెంకట్, ఇందువదన్‌రెడ్డి, రమేష్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

19న బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

ఖమ్మం ఖానాపురంహవేలి నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ కమిషన్ నవంబరు 19న ఉదయం 10 గంటల నుంచి, సాయంత్రం 4 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలపాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

తల్లాడ, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండలం నారయ్యబంజర గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోట్రు శరత్‌బాబు, మాజీ ఎంపీటీసీ పోట్రు చిన్నదర్గయ్య, సొసైటీ డైరెక్టర్లు జంగా చిన్నవెంకటరెడ్డి, తొండపు వీరాంజనేయులు పాల్గొన్నారు.

వైరాలో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

వైరా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు జోరుగా నడుస్తోంది. మూడురోజుల కిందట ఈ సభ్యత్వ నమోదు మొదలైంది. ఆదివారం వైరా, తాటిపూడితో పాటు పలు గ్రామాలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. పార్టీ కార్యకర్తల నుంచి అనూహ్య స్పందన లభించిందని టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సురేందర్ తెలిపారు. కార్యక్రమంలో బండి గోపాలకృష్ణ, మేదరమెట్ల పూర్ణచంద్రరావు, శ్రీనివాసరావు, నూకవరపు అయ్యప్పచౌదరి పాల్గొన్నారు.

మున్నూరుకాపులంతా ఐక్యంగా ఉండాలి

» ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీఆర్ఎస్ నాయకుడు కృష్ణ



వన సమారాధనలో పాల్గొన్న మున్నూరుకాపు సంఘ నాయకులు

కొణిజర్ల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపులంతా ఐక్యంగా ఉండాలని ఖమ్మం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఆర్ఎస్ నాయకుడు ఆర్‌జేసీ. కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని తనికెళ్ల గ్రామంలో నిర్వహించిన మున్నూరుకాపుల వనసమారాధనలో పాల్గొని మాట్లాడారు. ఐక్యతతో ఉంటేనే సమస్యలు సాధ్యం అవుతాయన్నారు. వనప్రత్యేక పూజలు చేశారు. లేడిబోయిన గోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్నూరుకాపు నేతలు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, కట్ల రంగారావు, యాసా మునేశ్వరరావు, గడల రామారావు, రోకటి సురేష్, రామిశెట్టి రాంబాబు, సైదులు, శివశంకరవరప్రసాద్, శ్రీను, డాక్టర్ పెదమళ్ల సురేందర్, బండి లక్ష్మినారాయణ, యాసా నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కోల్‌మైన్ లేబర్ యూనియర్ సోషల్ మీడియా జనరల్ సెక్రటరీగా రావి



సత్తుపల్లి, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కోల్‌మైన్ లేబర్ యూనియన్ సోషల్ మీడియా జనరల్ సెక్రటరీగా రావి నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఆదివారం ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు రావి తెలిపారు. మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన ఈయన కాంగ్రెస్ పార్టీలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అటు ప్రజల సమస్యల పరిష్కారంలోనూ.. ఇటు పలు సంఘాల అభివృద్ధిలోనూ.. పార్టీని బలోపేతం చేసి నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను గెలిపించడంలో ఆయన ఎనలేని కృషి జరిపినట్లు కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు ఇటీవల సత్తుపల్లి లారీ అసోసియేషన్ ఎన్నికలలో ఈయన మెజార్టీతో గెలుపొందిన విషయం విధితమే.

ప్రశాంతంగా గ్రూప్-3 పరీక్షలు

కొణిజర్ల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏడు కేంద్రాలలో మొత్తం 2,344 మంది విద్యార్థులకు గాను ఉదయం 1,183 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 1,161 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2,344 మందిలో 1,178 మంది హాజరుకాగా, 1,166 మంది గైర్హాజరయ్యారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను విధించారు. విజయ కళాశాల కేంద్రం వద్ద ముగ్గురు యువకులు, ఓ దివ్యాంగురాలు సమయం అయిపోయిన తర్వాత వచ్చారని, వారిని అనుమతించకపోవడంతో నిరాశగా వెనుతిరిగారు. పోలీస్‌లు బందోబస్త్ నిర్వహించారు.



విజయ కళాశాలలో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న అధికారులు



సమయం అయిపోవడంతో గేటుబయట ఆగిపోయిన అభ్యర్థులు

కోట మైసమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయండి

కారేపల్లి, నవంబరు17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోటమైసమ్మతల్లి ఆలయంలో అధికారులు హలాల్ నిషేధం అంటు ప్లెక్సీలు ఏర్పాటు చేయడం కాదని, ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆలయానికి సంబంధించిన భూములపై కూడా అనుమానాలు ఉన్నాయని, వాటిపై కూడ స్పష్టమైన ఆధారాలు చూపించాలన్నారు. అమ్మవారి వద్దకు అన్ని కులాలకు చెందినవారు వస్తారని, వచ్చినవారు మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు. కేవలం ఒక్కమతంపైనే హలాల్ నిషేధం అంటు బోర్డులు పెట్టడం సరికాదన్నారు. అమ్మవారి ఆలయంలో జంతువులబలి నిషేధం అంటు ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. ఆలయంలో భక్తులకు సరైన సౌకర్యాలు లేవని, మరుగుదొడ్లు, మూత్రశాలలు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు.

సీపీఐది వందేళ్ల పోరాట చరిత్ర

» పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



సభ్యత్వం అందజేస్తున్న పోటు ప్రసాద్

పెనుబల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పోరాట చరిత్ర అజరామమని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని లింగగూడెం, గట్టుగూడెం గ్రామాల్లో సీపీఐ శతజయంతి సందర్భంగా పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పురాతన పార్టీ సీపీఐ అని, డిసెంబరు 25నాటికి వందో సంవత్సరంలోకి అడుగుపెడుతుందన్నారు. పార్టీ శతజయంతి ఉత్సవాలను 2025 సంవత్సరం మొత్తం దేశవ్యాప్తంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగు నర్సింహారావు, మండల కార్యదర్శి కొమ్మినేని సుధాకర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ఇటికాల రామకృష్ణ, సొసైటీ డైరెక్టర్ బద్దం జోగయ్య, బద్దం పుల్లయ్య, వట్టం శ్రీను, శివ పాల్గొన్నారు.

సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలి

» మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



తల్లాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సన్నరకం ధాన్యం విక్రయించిన రైతులకు ప్రతి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తల్లాడ సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో వరి నూర్పిడిలు జరిగే సమయానికే ప్రభుత్వం పకడ్బందీగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో సీఎంఆర్ ద్వారా ధాన్యం కేటాయింపుల్లో మిల్లర్లతో ఒప్పందం చేసుకోవడంలో కాలయాపన జరగడం, కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటుచేయకపోవడం, ధాన్యం సేకరణకు అవసరమైన గన్నీసంచుల సరఫరాలో వైఫల్యం వంటి సమస్యల వల్ల ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. నూర్పిడిలు జరిగిన తర్వాత ధాన్యాన్ని రైతులు నిల్వ చేసే పరిస్థితి లేకపోవడం, అకాల వర్షాలు వంటి వాటి వల్ల సన్నరకం ధాన్యాన్ని రైతులు ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లకు అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. 40శాతానికిపైగా సన్నరకం ధాన్యాన్ని రైతులు ప్రైవేట్ వ్యాపారులు, మిల్లర్లకు అమ్ముకోవడం జరిగిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారని వివరించారు. గత ఏడాది ఈ సమయానికి సత్తుపల్లి నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో గ్రామాల వారీగా సన్నరకం ధాన్యం పండించిన రైతుల వివరాలను సేకరించి రూ.500బోనస్‌ను ప్రభుత్వం రైతులకు అందజేయాలన్నారు. ఇప్పటికైనా అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతుల వద్ద నున్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా వేగవంతంగా కొనుగోలు చేయాలన్నారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో కఠినతరమైన నిబంధనల వల్ల రైతులు పత్తిని అమ్ముకోలేకపోతున్నారని, సీసీఐ కేంద్రాలు రైతుల కోసం కాకుండా దళారుల కోసం ఏర్పాటు చేసినట్లు ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కటికి నర్సింహారావు, బీఆర్ఎస్ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్‌లాల్, నాయకులు కేతినేని చలపతిరావు, వజ్రాల రామిరెడ్డి, మువ్వా మురళీధర్‌రావు, రుద్రాక్షల బ్రహ్మం, బద్దం కోటిరెడ్డి, దగ్గుల శ్రీనివాసరెడ్డి, జీవీఆర్, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, సీపీఎం మం డల నాయకుడు గుంటుపల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

భక్తిభావం కలిగి ఉండాలి: సండ్ర

కల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వాముల ఇరుముడి పూజలు జరిగాయి. ఈ సందర్భంగా కాటేపల్లి రజనీస్వామి, పోట్రు కిరణ్ స్వాములకు సండ్ర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌స్వామి, అయ్యప్పస్వామి మాలదారులు మోటమర్రి వేణుస్వామి, సాగర్‌స్వామి, గౌరవరపు కిషోర్‌స్వామి, బీఆర్ఎస్ నాయకులు మేకల కృష్ణ, యస్‌కె కమ్లి, రాచమళ్ల నాగేశ్వరరావు, కొరకోప్పు ప్రసాద్, అర్లప్ప, సీహెచ్ కిరణ్ ఉన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

» జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వేము రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

కల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు కనీస వేతన చట్టం అమలు చేయాలని జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు వేము రాంబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం కల్లూరులో విజ్ఞాన్ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన మండల స్వీపర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కల్లూరు మండల ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. (ఏఐటీయూసీ అనుబంధం) గౌరవ అధ్యక్షుడిగా వేము రాంబాబు, మండల అధ్యక్షురాలిగా యస్‌కె. మలేఖ, కార్యదర్శిగా వేల్పుల కమల, ఉపాధ్యక్షురాలిగా గొల్లమందల స్వరూపరాణి, కోశాధికారిగా ఎక్కిరాల మల్లయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దమాల దయాకర్, కళావతి, నాగమణి యశోద తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తా

» ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



కొణిజర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొణిజర్ల, నవంబరు17(ఆంధ్రజ్యోతి): పేద ఆర్యవైశ్యుల అభ్యున్నతికి అన్ని విధాలుగా కృషి చేస్తానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. ఆదివారం కొణిజర్ల మండల ఆర్యవైశ్య వన సమారాధనలో పాల్గొని మాట్లాడారు. వైరా మార్కెట్ కమిటీలో కూడా స్థానం కల్పిస్తామన్నారు. ఆర్యవైశ్యులంతా ఉన్నతంగా ఎదగాలని ఆకాక్షించారు. ఇందిరమ్మ ఇల్లులు, పింఛన్‌లలో ప్రాధాన్యత కల్పిస్తామని తెలిపారు. నియోజకవర్గస్థాయిలో ఒక కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కాంగ్రెస్ జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, మండల అధ్యక్షుడు వడ్డే నారాయణరావు, ఆర్యవైశ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, మండల కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాసరావు, కొనతం శ్రీనివాస్, అనుమోలు కృష్ణప్రసాద్, జవ్వాజి నాగేశ్వరరావు, చోడవరపు నరసింహరావు, పసుమర్తి సత్యం తదితరులు పాల్గొన్నారు.



వైరాలో నిర్వహించిన వన సమరాధనలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

వైరాలో ఆర్యవైశ్యుల వనసమారాధన

వైరా, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఆదివారం వైరాలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వాసవీమాత, ఉసిరిచెట్టుకు పూజలు చేసి సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్య క్ష, ప్రధాన కార్యదర్శులు పసుమర్తి చంద్రరావు, వనమా విశ్వేశ్వరరా వు, మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్, డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, మిట్టపల్లి నాగి, సత్యంబాబు, రమణ, శ్రీనివాసరావు, నూకల వాసు, ప్రసాద్, కొల్లా రాంబాబు, గజ్జల కృష్ణమూర్తి పాల్గొన్నారు.